క్లుప్తంగా

గ్రామ వీధుల్లో ఊరేగిన బంగారమ్మ



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న శ్రీ బంగారమ్మ

కార్వేటినగరం: సంస్థానాధీశుల కాలం నుంచి కార్తీక మాసంలో నిర్వహించే కార్వేటినగరం జాతరను పురస్కరించుకుని శనివారం అమ్మవారి బంగారు విగ్రహాన్ని గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పాలు, పెరుగు, తేనే, పసుపు, చందన, నారికేళి జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్ప మాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. విశ్రాంత ఉద్యోగులు జాతర వేషాలతో ఊరేగింపులో పాల్గొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యాక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, యువత పలువురు పాల్గొన్నారు.



తోటి వేషాలతో విశ్రాంత ఉద్యోగులు

అంధకారంలో బీఎంవీపల్లె ఎస్సీ కాలనీ



తెగి పడిన విద్యుత్ తీగలు

వెదురుకుప్పం: మండలంలోని బలిజమొండివెంగనపల్లె అంధకారంలో ఉంది. గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే తీగలు తుప్పు పట్టి ముక్కలు ముక్కలుగా తెగిపడిపోతుండడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు సింగిల్‌ఫేజ్ లైన్ తుప్పు పట్టిందని వాపోతున్నారు. అక్కడక్కడ వైర్లు తెగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినట్లు చెబుతున్నారు. శనివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్వాకంతోనే గ్రామం అంధకారంలో ఉందని, ఉన్నతస్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని, ఆయన త్యాగం అజరామరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వీరయ్య పేర్కొన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి డిసెంబర్ 15వ తేదీ ఆదివారం రావడంతో శనివారమే విద్యార్థులతో కలిసి ఆయనకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు 57 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారని తెలిపారు. గాంధీజీకి ప్రియ శిష్యుడైన శ్రీరాములు సత్యం, అహింస, హరిజనోద్ధరణ వంటి సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా పాటించారని వెల్లడించారు. పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులు హరిణి, కావ్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు, సుజన, సావిత్రి, గాయత్రి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి చాపల విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి శనివారం ఓ భక్త బృందం చాపలను విరాళంగా అందజేసింది. సంకటహర చతుర్థి వ్రతం పూజలు చేసుకునే వారి కోసం కర్ణాటక రాష్ట్రం ముల్‌బాగల్‌కు చెందిన రమేష్ మిత్ర బృందం 300 చాపలను విరాళంగా ఇచ్చింది. అనంతరం వారికి ఆలయ ఏఈవో రవీంద్రబాబు ప్రత్యేక దర్శనం భాగ్యం కల్పించారు.

పుత్తూరులో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం



పైకప్పు పెచ్చులూడిన గది



భయం గుప్పెట్లో బాలికలు

ఎన్నో ఆశలతో సొంత గ్రామాలను వదలిపెట్టి పట్టణాలకు తరలి వచ్చిన బాలికలకు ఇక్కడి హాస్టళ్లు వారి బతుకుల పైనే అపనమ్మకాన్ని కలిగిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదుల్లో పాఠాలు విని, పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన చిన్నారులు రాత్రిళ్లు నిర్భయంగా కంటి నిండా నిద్రించే పరిస్థితి లేదు. ఏ క్షణాన ఏ పైకప్పు ఎవరిపైన పడుతుందోనని అమ్మాయిలు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. దుస్థితికి చేరిన పుత్తూరు ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినుల దయనీయ పరిస్థితి ఇది.

- దుస్థితికి చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం
- కంటిమీద కునుకు లేక అవస్థల్లో విద్యార్థినులు
- నూతన భవనం కోసం ఎదురుచూపులు

పుత్తూరు: పట్టణంలోని వసతి గృహాల్లో సౌకర్యాలు కొరవడుతున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణా లోపంతోపాటు అధికారుల నిర్లక్ష్యం ఇందుకు ప్రధాన కారణం. పుత్తూరులో ఎస్సీ ప్రీ మెట్రిక్ హాస్టల్, బీసీ ప్రీ మెట్రిక్ హాస్టల్, బీసీ పోస్టు ప్రీ మెట్రిక్ హాస్టల్ (కాలేజీ విద్యార్థులు), ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ ప్రీ మెట్రిక్ హాస్టల్‌తోపాటు రెండు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అన్ని వసతి గృహాల్లో కలిపి వందలాది మంది విద్యార్థినీవిద్యార్థులు ఉన్నారు. ఒక్కో వసతి గృహంలో ఒక్కో సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పుత్తూరు పట్టణంలోని ఎస్సీ ప్రీ మెట్రిక్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. 1984లో నిర్మించిన ఈ భవనంలో 12 గదులు ఉండగా ప్రతి గదిలోని సీలింగ్ పెచ్చులూడి లోపలి కమ్మీలు కనబడుతున్నాయి. గోడలన్నీ బీటలు వారాయి. ఇటీవల వర్షాలు భారీగా కురుస్తుండడంతో విద్యార్థినుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 85 మంది విద్యార్థినులు ఉన్న ఈ హాస్టల్ పైకప్పు ఎప్పుడు ఎవరిపైన పడుతుందోనని భయంతో రాత్రిళ్లు గడుపుతున్నారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో మరమ్మతులు చేపట్టినా అవి తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించాయి. విద్యార్థినులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించడానికి నూతన భవనం ఒక్కటే ప్రత్యామ్నాయం. ఆ దిశగా ప్రభుత్వం నూతన భవనానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. హాస్టల్‌లో వార్డెన్‌తోపాటు ముగ్గురు ఉండాల్సిన సిబ్బంది ఇద్దరే ఉన్నారు. కుక్ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో వాచ్‌మెన్, కమాటీలే వంటపని సైతం చేస్తున్నారు. ఈ పోస్టును సైతం భర్తీ చేయాల్సి ఉంది. ఇలా ప్రతి వసతి గృహంలో ఏదో ఒక సమస్య పిల్లలను వెంటాడుతోంది. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి, తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.



పైకప్పు పెచ్చులూడిన మరో గది



పైకప్పు పూర్తిగా దెబ్బతిన్న వరండా

వర్షంతో మిగిలిన వేదన



వడమాలపేట: టీసీ అగ్రహారంలో వరి పంటపై ఇసుక మేట

వడమాలపేట(విజయపురం): ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ఒకవైపు తుపానులు, మరోవైపు కుంభవృష్టి వర్షాలు రైతాంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఉప్పొంగిన వాగులు, వంకలు పొంగి పొరుతుండటంతో రైతు తీవ్ర నష్టపోతున్నాడు. ఎన్నడూ చూడని విధంగా నియోజకవర్గంలో అన్ని వైపుల నుంచి ప్రకృతి కన్నెర్రజేయడంతో ప్రజలు, రైతులు విలవిల్లాడిపోయారు. పంటలు కకావికలం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోతున్నారు. అప్పులు చేసి సాగు చేసి పంటలు కంటి ముందే మునిగిపోయాయని ఆవేదన చెందుతున్నారు. మరో పక్క గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అక్కడక్కడా తారురోడ్లు దెబ్బతిన్నాయి. వంతెనలు కుంగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి.



పాదిరేడులో నీట మునిగిన వరి పంట



వర్షానికి దెబ్బతిన్న తడుకు రైల్వేస్టేషన్, పాదిరేడు గ్రామీణ రోడ్డు

ఏకపక్షంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- అధికార పార్టీ నేతలు నిర్ణయించిన వారికే పదవులు
- సాగునీటి ఎన్నికలు ఏకగ్రీవంపై సీపీఐ వ్యతిరేకత
- వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్



గుండ్రాజుకుప్పం జడ్పీహెచ్ఎస్‌లో సాగునీటి సంఘ ఎన్నికలు

నగరి: పేరుకు సాగునీటి ఎన్నికలు... అంతా ఏకపక్షంగానే జరిగాయి. ఎన్నికలను ప్రతిపక్ష వైఎస్ఆర్ సీపీకి చెందిన వారు బహిష్కరించడం, ఇతరులు పోటీ చేయడానికి వచ్చినా అధికార పార్టీ నేతలు వారిని పోటీలో నిలవకుండా, చేతులెత్తే అవకాశం లేకుండా చేశారు. అనుయాయులకే పట్టం కట్టారు. నియోజకవర్గంలో అత్యధికంగా నింద్ర మండలంలో 16 సంఘాలకు ఎన్నికలు జరిగాయి, నగరి మండలంలోని 10, విజయపురం మండలంలో 12 సంఘాలకు, పుత్తూరు మండలంలో 7, వడమాలపేట మండలంలో 11 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అన్ని స్థానాలు అధికార పార్టీ నేతలే కైవసం చేసుకున్నారు. పుత్తూరు మండలం గూళూరు చెరువుకు శీనయ్య అనే వ్యక్తి పోటీ పడడానికి వెళ్లగా అధికారులు మేనేజ్ చేశారు. నేసనూరులోను ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని చోట్ల స్థానిక టీడీపీ నాయకులు ఎన్నికలను ఏకపక్షం చేసుకున్నారు.

సీపీఐ వ్యతిరేకత

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నీటి సంఘాల ఎన్నికలను ఏకగ్రీవంగా చేసుకోవడానికి అధికార పార్టీ జోక్యం చేసుకోవడాన్ని సీపీఐ వ్యతిరేకించింది. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు ఈ విషయాన్ని పార్టీ సమావేశం నిర్వహించి స్పష్టం చేశారు. రైతుల కోసం నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దీనిని సీపీఐ స్వాగతిస్తోందన్నారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ తమ అనుకూల వర్గం కోసం ఏకగ్రీవం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైందని, రైతులు వేసిన వేరుశనగ, వరి పంటలు నష్టపోయారన్నారు. పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో, నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం చేసుకోవడంలో చూపించిన చొరవ రైతులను ఆదుకోవడానికి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు వేలన్, బాషా, ఏఐటీయూసీ నాయకులు మురళి, రాజేంద్ర, శేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకపక్షం

పాలసముద్రం: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు కూటమి నాయకుల కోసమే నిర్వహించినట్లు అయింది. అధికారులు కూడా సాగునీటి సంఘాల ఎన్నికల్లా కాకుండా అధికార పార్టీ ఎన్నికలా? అనేలా ఏకపక్షంగా వ్యవహరించడం గమనార్హం. మండలంలోని వెంగళరాజుకుప్పం, రామలింగాపురం, వనదుర్గాపురంలో అయితే టీడీపీ, జనసేన నాయకులకు తప్ప సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి తమకు సమాచారం అందలేదని గ్రామస్తులు, ఓటర్లు అధికారులను నిలదీశారు. శ్రీకావేరిరాజుపురం కొత్త చెరువుకు బెంగళూరులో ఉన్న ఓ వ్యక్తి పేరిట నామినేషన్ తీసుకోవాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేసినా అధికారులు నిరాకరించారు. 12 గంటలకు పైన మరో వ్యక్తిని తీసుకొచ్చి నామినేషన్ వేయించారు. నిబంధనల ప్రకారం 10.30 గంటల లోపు నామినేషన్ వేయాలి. అలాగే నామినేషన్ వేసే వ్యక్తిని ఇద్దరు సాక్షులు, ఒకరు ప్రతిపాదించాలి. అయితే టీడీపీ నాయకులు నిలబెట్టిన అభ్యర్థికి కనీసం ప్రతిపాదించే వారు కూడా లేకపోవడంతో.. ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చి బతిమాలుకున్నారు. పాలసముద్రం హైస్కూల్లో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో బినామీ డీలర్ చెప్పినట్లు అధికారులు వ్యవహరించారు. సాగునీటి సంఘాల ఎన్నికల జాబితాలో కేవలం టీడీపీ నాయకుల పేర్లు మాత్రమే ఉన్నాయని, అసలైన రైతులు పేర్లు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీటి సంఘ చైర్మన్లకు సన్మానం

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు, టీకేఎంపురం, వేణుగోపాలపురం, ఆళ్లమడుగు గ్రామాల్లోని చెరువులకు శనివారం జరిగిన నీటి సంఘ ఎన్నికల్లో చైర్మన్లుగా ఎన్నికైన ఈశ్వరరెడ్డి, కేశవులు రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కామసానిదామోదర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్లపల్లె మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌మురళి, నాయకులు పాల్గొన్నారు.



నీటి సంఘ చైర్మన్లను సన్మానిస్తున్న నేతలు





మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, సాగునీటి సంఘాల ఎన్నికల కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న అధికారులు

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. లోక్ అదాలత్ మెంబర్లుగా న్యాయవాదులు ఎం.సంజీవి, కె.రాజేష్, ఎ.దీపక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 188 కేసులు పరిష్కారం

నగరి: నగరి జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శనివారం జడ్జి విష్ణువర్మ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్-08, క్రిమినల్ ఐపీసీ -11, క్రిమినల్ ఎక్సైజ్-17, సీసీ-03, క్రైమ్ స్టేజ్ -04, సెకండ్ క్లాస్ -135, పీఎల్‌సీ -10 తదితర 188 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ.18,78,550 రికవరీ చేశారు. ఈ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



నగరి లోక్ అదాలత్‌లో కేసులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ





పుత్తూరు: మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, పక్కన జడ్జి జానకి, కేసుల పరిష్కారం కోసం వచ్చిన కక్షిదారులు

రహదారులు ఛిద్రం

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం
- నరకయాతన పడుతున్న వాహనదారులు



ఛిద్రమైన వంతెన రోడ్డు

నగరి: మున్సిపల్, మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారులన్నీ దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, బురదమయమైన దారులే కనిపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీటితో నిండిన గుంతలు కుంటలను తలపిస్తున్నాయి. ఇక గ్రామాల్లో అయితే రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కిలోమీటర్ల మేర దారులు అధ్వానంగా తయారవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

అభివృద్ధి లేదు.. రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ గతంలో ప్రచారాలు సాగించిన కూటమి పార్టీల నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా.. వారికి రోడ్లపై గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యమిస్తామని ప్రకటించిన కూటమి నేతలు.. మాటలకే పరిమితమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా చూపడం లేదు. డబ్బుల్లేవు.. గల్లా పెట్టె ఖాళీ అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. కీళపట్టు, నగరి ఇందిరమ్మ కాలనీ, ముడిపల్లి, తడుకుపేట, నెత్తంకండ్రిగ, వీకేఆర్‌పురం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న ముడిపల్లి రోడ్డు